
# చేమంతులు పెరగని నేల



పణాతుల రామచంద్రయ్య

ఉన్నదేమో చిలకా గోరింకల్లాగా ఇద్దరే ఇద్దరు; ఆ యిద్దరికీ, ఇప్పుడున్న యింటి కన్నా పెద్దయిల్లు ఎంతమాత్రం అవసరం లేదన్న ఇరుగుపొరుగుల అభిప్రాయంతో గోపాలానికి పేచీలేదు. పైగా ఆ వూళ్ళో వుద్యోగంలో చేరిన ఆరునెలలకే యిల్లు మారటం-అందులోనూ ముచ్చటైన ఆ చిన్నవాటా వదిలేసి, వూరికి దూరంగా అంత అద్దె యిచ్చి లంకంత యింట్లో చేరటం_అతడికే కాస్త ఎబ్బెట్టుగా తోచక పోలేదు.

అయినా ఫరవాలేదనుకున్నాడు. ఇరుగు పొరుగులకు సమాధానంగా, తన తల్లిదండ్రులు ఎప్పుడైనా ఆ వూరికి వస్తే అప్పుడు అందరికీ కలిసి ఆ చిన్నవాటా సరిపోదు కాబట్టి పెద్దయింటికి మా తున్నామని చిన్న అబద్ధం చెప్పాడు. ఆ యిరుగుపొరుగుల పిల్ల చేసే కాకిగోల భరించలేకనే జానకి చిరాకుతో యిల్లు మారాలంటు దని అతడికి అనిపిస్తున్నా, "ఈ యింటిలో నాకిష్టమైన చేమంత పెంచుకోవటానికి వీల్లేకుండా వుందండీ," అంటూ ఆమె చేసే ఫి దును నమ్మినట్లే నటించాడు.

అలా అడపాదడపా నటించటం, దాంపత్య జీవితానికో అ మైన మేలిముసుగు వంటిదని గోపాలం అభిప్రాయం. పెళ్ళయిన ( పదేళ్ళలోనూ తను జానకి చిరాకులు మాన్పటానికై పాటించే

ద్ధతి సులుబుగానే కనిపిస్తోంది అతడికి. ముందు ముందు కొడుకో కూతురో పుడితే, అప్పుడామె యీ చిరాకులన్నీ విడిచిపెట్టి, దృష్టంతా ఆ బిడ్డమీదే లగ్నంచేసెయ్య గలదు. జానకిలాంటి వ్యక్తుల్లో అలాంటి అతీత పరివర్తన చాలా సహజం.........

మునిసిపాలిటీ లారీవచ్చి, సామానంతా ఒక్కరోజులో కొత్త యింటికి చేరేసింది. చేరాక అదంతా సర్దుకోవటానికి రెండ్రోజులకన్నా ఎక్కువ పట్టలేదు. ఇల్లు విశాలంగా వుండటం వల్ల. "ఇక్కడ నీ చేమంతులు పెంచటానికి ఓ ఫుల్ టైమ్ తోటమాలిని పెట్టేస్తాను. నువ్వు హైరానాపడకుండా, వంటపనికిపోను మిగిలిన టైంలో హాయిగా మేగజైన్లు ముందేసుకుని టీవీ ముందు కూచో." అన్నాడతడు.

"అలా కూచుంటే ఒళ్ళు పెరిగి నానా రోగాలూ వస్తాయి బాబూ... తోటపనంతా నాకే వదిలేద్దురూ—" అంది జానకి.

ఆమె ఉత్సాహానికి తగ్గట్టుగానే, యింటికి ముందు వెనకా బోలెడు స్థలం. చుట్టూ ఎత్తైన కాంపౌండు. లోపల రెండు కొళాయిలు. ఒక కొళాయి దగ్గర్నించీ చెట్లపాదుల్లోకి చిన్న సిమెంటు కాలవలు.

కాంపౌండు కవతల వున్నయిల్లు, ఎవరిదోగానీ, పొందికగా లేదు. ఆ యింటి కాంపౌండు కూడా చిన్నది. దాన్నిండా గడ్డీ, గాదం, రాలిపడిన గన్నేరు ఆకులూ, దుబ్బులూ, పెరిగి వున్నాయి. "ఇల్లు శుభ్రంగా వుంచుకో కూడదూ— ఒళ్ళు బరువు కాకపోతే", అంది జానకి ఆయింటి వాళ్ళనిగురించి, రెండ్రోజుల తర్వాత.

"మనకెందుకు పోనిద్దూ," అన్నాడు గోపాలం.

కాని అలాపోనివ్వలేదు జానకి. ఆ మర్నాడు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన గోపాలంతో, "మీరేమో పాదులు తవ్వటానికి మనుషుల్ని పెట్టివెళ్లారా.... వాళ్లు తవ్వుతున్నంత సేపూ పక్కింటి పిల్లలు వచ్చి ఒకటే గోల", అంది.

"ఏదో, చిన్నపిల్లలు".

"ఏం పిల్లలో బాబూ ! చాలీచాలని చొక్కాలు, చింపిరిజుత్తూ, వాళ్ళూనూ, పిల్లల్ని కనటం కాదుగొప్ప; సరిగా పెంచటం తెలియాలి."

నాలుగురోజులయ్యాక మంచి వానజల్లు పడటం వల్ల, కాంపౌండులో ఎరువు వెయ్యటం, చేమంతులు నాటటం తేలికైపోయింది. చేమంతుల మధ్యగా వెరైటీ కోసం ముద్దబంతులూ, అక్కడక్కడా కొన్ని మిరప మొక్కలూ, నాటారు. మిరపకాయలు కాసి చెట్లలోనే పండితే, ఆ ఎరుపుదనం చేమంతుల పచ్చదనాల మధ్య ఫెళఫెళా మంటూ అందగిస్తుందని జానకి ఆశ.

కాని, రెండు వారాలయ్యాక చూస్తే, చేమంతులు ఎక్కువగా పెరగటం లేదు. జానకి మొహంలో అసంతృప్తిని గమనించి, కాస్త అనునయించే ధోరణిలో అన్నాడు గోపాలం : "నీ కృషిలో లోపం లేదు జానీ! కాని యీనేల మొక్కలకు మంచిది కాదేమో ! అందుకే, పక్కింటి వాళ్లుకూడా కాంపౌండునంతా బీడు పెట్టేసినట్లున్నారు".

"అదేంకాదు", అంది జానకి, "పక్కింటి వాళ్ళది సోమరితనం. అందువల్ల మన తోటకూ్కడా న్యూసెన్సుగావుంది.".

"మన తోటకా?" ఆశ్చర్యంగా చూశాడతడు.

"అవును-చూడండి, గాలివీచినప్పుడల్లా వాళ్ళ కాంపౌండులోంచి ఎండిన ఆకులూ, చెత్తా లేచివచ్చి మనచెట్లమధ్య పడుతున్నాయి. ఈ రోజంతా వాటిని ఏరి పారెయ్యటంతో సరిపోయింది".

అతడు జవాబివ్వలేదు. పక్క కాంపౌండులో ఎండుటాకులు ఒకమూల కుప్పగా వేసివున్నా, ఆ కుప్ప జానకి ఆదుర్దాను సమర్థించేటంత పెద్దదిగాలేదు. అయినా అతడు భార్యమాటలకు కోపం తెచ్చుకోకుండా, "మరీ అలాచిరాకు పడిపోకు జానీ! ఎంతైనా పొరుగువాళ్ళు", అన్నాడు.

అయినా ఆ పొరుగు వాళ్ళతో ఎలాంటి ప్రమేయం పెట్టుకోకుండా, ఎదురింటి తులశమ్మతో పరిచయం పెంపొందించుకుంది జానకి. ఇందుకొక కారణం గమనించాడు గోపాలం. అదేమిటంటే, తమ పక్కింటి వాళ్ళ విషయంలో జానకి అభిప్రాయాలూ, తులశమ్మ అభిప్రాయాలూ ఒకటేనని... రోజూ కాఫీపొడి కనీ, కరివేపాకు కనీ, కొబ్బరిముక్క కనీ వచ్చే తులశమ్మ ఆ సందర్భాల్లో అందించే సమాచారాన్నంతా సాయంకాలాల్లో భర్తకు చేరవేస్తోంది జానకి ; పక్కింటి వాళ్ళు మొరటు వాళ్ళట. అతడెక్కడో తెలుగు టీచరుగా అఘోరిస్తున్నాడట. భార్యాభర్తలెప్పుడూ పోట్లాడు కుంటుంటారట. పిల్లలు స్నానం చేశారా, అన్నంతిన్నారా, చదువుకుంటున్నారా అనైనా గమనించు కోరట.

అదంతా నిజమనిపించేట్టుగా, ఒకరోజు రాత్రి గోపాలం, జానకి టీ.వీ.చూస్తున్నప్పుడు,పక్కింట్లోంచి అరుపులు,ఏడుపులు ఖంగుఖంగున గిన్నెల శబ్దాలూ వినిపించాయి. ఆమర్నాడు పొద్దునే పక్కింటిముందు రెండురిక్షాలు ఆగటం, ఆ టీచరు భార్యా పిల్లలూ వాటిల్లో ఎక్కి వెళ్ళిపోవటమూ గమనించాడు గోపాలం. ఈ కొత్తయింట్లో చేరి నెల కావస్తున్నా, అతడు పక్కింటి పిల్లల్ని చూడటం ఇదే మొదటిసారి: ఇద్దరివీ ముచ్చట కలిగించే ముద్దయిన మొహాలు. తల్లిదండ్రుల తగవుల్ని అర్థంచేకోలేని ఆపిల్లలు, అమ్మతోబాటు రిక్షాఎక్కేముందు "వెళ్ళొస్తాం నాన్నా" అనటం చూచిన గోపాలానికి జాలికలిగిన మాట వాస్తవం కాని ఆ జాలిని భార్యముందు వెల్లడించలేదతడు.

గోపాలం అతడి తల్లిదండ్రులకు నలుగురు కూతుళ్ళమధ్య ఒకే ఒక మగబిడ్డకావడంతో, అతడి భార్య జానకికి కూడా ఆ యింట్లో అడుగు పెట్టినప్పట్నుంచీ ఒక ప్రత్యేక స్థానం లభించింది. కాలు కింద పెట్టనివ్వకుండా చూచుకునే అత్తగారు; లక్షల ఆస్తికి ఏకైక వారసుడినన్న ధీమాతో భార్య ఏం కోరినా తెచ్చియిద్దామనుకునే భర్తా; గౌరవించే వదినెలూ, మరదళ్ళూ — వున్న ఆ యింట్లో, కొడుకునూ కోడల్నీ కొన్నాళ్ళపాటు తమ దగ్గరే వుంచుకుని ముచ్చట చూడాలనుకున్న తల్లిదండ్రులు, గోపాలానికి వచ్చిన వుద్యోగాలన్నీ ఏదోవంకతో తోసేస్తూ వచ్చేరు. ఆఖర్న, యీ నెల్లూరులో మునిసిపల్ ఇంజనీరుగా వుద్యోగం దొరికి, భార్యాభర్తలు ప్రయాణమవుతోంటే, అపురూపమైన తన కోడలు ఒంటరిగా ఎలా చేసుకోగలదా అని ఆ అత్తగారు ఆదుర్దా పడిపోయినమాట వాస్తవం. అయితే ఆవిడ వెల్లడిచెయ్యని మరో ఆదుర్దా ఏమిటంటే, తాను దగ్గర లేకుంటే ఆ అబ్బనాకారపు కోడలిచేత సంతాన వ్రతాలన్నీ ఎవరు చేయిస్తారా అని.

తల్లికోరిక త్వరగా తీరితే బాగుండునని గోపాలం అనుకున్నా ఆ విషయంలో కొరత అతడికి లేదు. జానకిలో కూడా కనిపించలేదు.

"ఆ వెంకటనరసయ్య కున్న సంతానం మనకూ వుంటే, నాకు జీవితం మీద విరక్తి కలిగి వుండేది. ఎందుకొచ్చిన చీదరబాబూ ! " అంది జానకి ఒకరోజు, డైనింగ్ టేబులు సర్దుతూ. అప్పుడు తెలిసొచ్చింది గోపాలానికి, ఆ పక్కింటాయన పేరు వెంకటనరసయ్య అని.

మరో నెల గడిచింది. కాంపౌండులో చేమంతులు ఏపుగా పెరగక పోయినా, మధ్య మధ్య బంతి చెట్లూ, మిరపచెట్లూ నవ నవలాడుతున్నాయి. ఆ మిరపచెట్లలో యిప్పుడిప్పుడే పొటమరిస్తున్న కాయలు చెట్లలోనే ఎర్రగా పండే సమయానికి చేమంతులు కూడా పూతకువస్తే బాగుంటుందని గోపాలంతో రోజూ అంటోంది. జానకి "డోంట్‌వర్రీ మైడియర్ ! ఈ నేల చేమంతులకు అనుకూలంకానప్పుడు నువ్వు మాత్ర మేంచేస్తావు ?" అన్నాడతడు. అందుకు సమాధానంగా ఆమె పెదవులపై, కాలవమధ్యలో తలెత్తేఅలలాంటి నవ్వొకటి తేలింది-అంతే.

ఆ మర్నాడు గోపాలం ఆఫీసునుంచి మధ్యాన్నానికే యింటికొచ్చేసరికి, సన్నగా కురుస్తున్న వర్షపు తుంపరలో తడుస్తూ పూల మొక్కలమధ్య తిరుగుతోంది జానకి. గోపాలం యింట్లోకి వచ్చి కాఫీ తాగాక, కాంపౌండు గేటుతీసి, అక్కడే నిల్చుని వీధిలోకి చూడసాగాడు. వీధి వెడల్పుగా వుండి, ఇళ్లన్నీ తీర్చిదిద్దినట్లున్నాయి. కొత్తగా మునిసిపాలిటీలో కలిపిన ప్రదేశం కాబట్టి, ఇటీవలే వీధిలైట్లు వేసినట్లున్నారు. ట్రాఫిక్ రద్దీలేదు. గోపాలం అక్కడ నిల్చుని చూస్తోంటే, సామాన్లతో నిండిన లారీ ఒకటి వచ్చి ఎదుటి వరసలో ఓ యింటిముందు ఆగింది.

"ఆ యింట్లో ఎవరో కొత్తగా చేరుతున్నట్లుంది," అన్నాడతడు, తన వెనకే నిల్చున్న జానకితో.

"అవును. ఎవరో అరవ్వాళ్ళట. మొగుడూ, పెళ్లాం యిద్దరేనట. తులశమ్మ చెప్పింది" అంది జానకి.

ఆ లారీలోంచి మనుషులు సామాన్లన్నీ యింట్లోకి చేరవేస్తున్నంతలో, ఆ వెనకగా ఓ రిక్షా వచ్చి ఆగటం, దాన్లోంచీ నీటుగా ముస్తాబై వున్న కుర్రదంపతులు దిగి ఇంట్లో ప్రవేశించటం, ఆ యువతి తాలూకు వజ్రాల ముక్కుపుడక సాయంత్రపు నీరెండలో తళుక్కుమనటం, జరిగాయి.

"అతడు కలక్టరాఫీసులో పనిచేస్తున్నాట్ట."అంది జానకి మళ్ళీ.

"ఈ నెల్లూరులో వుద్యోగానికి ఆంధ్రులెవరూ దొరకనట్టు,అంత దూరం నుంచీ అరవ్వాళ్లను తీసుకురావటం దేనికో—" అన్నాడతడు.

జానకి వెంటనే జవాబివ్వలేదు, కాని ఆమె దానినే మననం చేస్తున్న దనిపించేట్టుగా, వారంరోజులయ్యాక అంది.

"అరవ్వాళ్లని మీరు ఆ రోజున గింజుకున్నారే! వాళ్ళెంత నాగరికంగా వున్నారో చూడండి. వాళ్లకూ. మన పక్కింటి వెధవ సజ్జుకూ, ఎక్కడ పోలిక ?"

"ఎలాంటి సజ్జయినా, తెలుగువాళ్లు. "

"బాగుంది. తెలుగువాళ్ళయినంత మాత్రాన నెత్తిన పెట్టుకోవటం నాకు చాతకాదు బాబూ! ", అని కాస్సేపాగి మళ్ళీ అందుకుంది జానకి, "పోట్లాడి వెళ్ళిన ఆ పెళ్ళామా, అయిపూ గియిపూ లేదు. ఈ త్రాష్టుడేమో, తను ఆడపెత్తనం సహించే రకం కాదని అందరి దగ్గరా ఆర్భాటం చేస్తున్నాట్ట .... అతడు మీతో కూడా మాట్లాడతాడని నాకు భయంగా వుంది."

"భయమెందుకు? " నవ్వాడు గోపాలం.

"ఎందుకేమిటి?" అంటూ జానకి మొహం కందగడ్డల్లే చేసుకుంది, "ఎందుకంటే .... నాకు నచ్చదు.

"భయపడకు. ఒకవేళ, తనకు ఆడపెత్తనం నచ్చదని అతడు నాతో అంటే, నాకుమాత్రం ఆడపెత్తనం చాలా యిష్టమని చెబుతాను. సరేనా? "

ఆమె మాట్లాడలేదు.

" నీ కివన్నీ చెబుతున్నది మీ ఫ్రెండు తులశమ్మేనా? " అన్నాడతడు మళ్ళీ.

" ఊఁ ".

గోపాలం ఇదివరకు రెండు మూడుసార్లు తులశమ్మను గమనించి వున్నాడు. మధ్యవయస్కురాలు. బిడ్డలు లేరట. మొహంలో, మాటల్లో, స్పష్టంగా లౌక్యం గోచరిస్తుంది. భర్తను అదుపాజ్ఞల్లో వుంచి సంసారాన్ని గుంభనగా నెట్టుకొచ్చే మనిషి, అనిపించింది గోపాలానికి. అయితే అతడామెపై ఎలాంటి వ్యాఖ్యానమూ చెయ్యలేదు.

అక్టోబరు నెల, కాసేపు కుండపోత వర్షాలతో, కాసేపు చుర్రుమనే ఎండలతో, తికమకలు పెడుతోంది. చేమంతులు ఇష్టం వుండీ లేనట్లు పెరుగుతూ, అక్కడొకటీ అక్కడొకటీ మొగ్గలు వేస్తున్నాయి. మిరపచెట్లలో కాయలు మాత్రం సమృద్ధిగా పచ్చదనం కుమ్మరిస్తూ, అప్పుడే గర్వంగా ఎరుపెక్కిపోతున్నాయి.

అలా చేమంతుల కోసం ఆగకుండా పెరిగిపోతున్న మిరపచెట్లు, రెండు మూడు రోజులుగా జానకి కోపాన్ని తప్పించుకుంటున్నాయి. కారణం - ఆమె యింట్లో లేదు; జొన్నవాడకు వెళ్ళింది. జొన్నవాడలో తులశమ్మ బంధువులెవరో వున్నారట. వాళ్ళ యింట్లో గడిపి, అక్కడి కామాక్షిదేవి గుడిలో పదిరోజులు ప్రదక్షిణాలు చేసి రావాలని వెళ్ళింది. ఆ సమయంలో ఒక సాయంత్రంవేళ, గోపాలం ఆఫీసు నుంచి నడిచివస్తోంటే, మధ్యలో వర్షం మొదలైంది. చేతిలో గొడుగు కూడా లేకపోవడం వల్ల, గబుక్కున ఓ బట్టలషాపులో దూరి నిల్చున్నాడు గోపాలం. వర్షం ఎడాపెడా దంచుతోంది. ఇహ గంటసేపైనా ఆ షాపుదగ్గర ద్వారపాలకత్వం తనకు తప్పదేమోనని గోపాలం అనుకుంటున్నంతలో — షాపులోంచి బయటికి వస్తున్నాడు పక్కింటాయన. ఆయన చేతిలో ఒక పాకెట్టూ, మరో చేతిలో గొడుగూ వున్నాయ్.

గోపాలాన్ని చూడగానే పలకరింపుగా నవ్వి, గొడుగు విప్పుతూ, "ఇంటికి వస్తున్నారా? .... రండి వెడదాం," అన్నాడు వెంకటనరసయ్య.

ఇద్దరూ గొడుగులో నిదానంగా నడుస్తూ, యిల్లు చేరేసరికి ఏడున్నరయింది. వీధిలో లైట్లు పోవటం వల్ల చీకటిగా వుంది. గోపాలం ఇంటితాళం తీసి లైటు వేస్తూ, "లోపలికిరండి" అన్నాడు.

వెంకటనరసయ్య గొడుగు వాకిట వుంచి, లోపలికొచ్చి కూచున్నాడు.

గోపాలం వంటిట్లోకి వెళ్ళి, పది నిముషాల్లో గాస్‌స్టౌ మీద టీ తయారు చేసి, తనకూ వెంకటనరసయ్యకూ రెండు కప్పుల్లో తీసుకొచ్చాడు.

"అయ్యో - ఇప్పుడెందుకండీ యిది ?" అంటూ, అంతకన్నా ఎక్కువ బెట్టు చెయ్యకుండా టీకప్పు అందుకున్నాడు వెంకటనరసయ్య.

"ఏమిటండీ ఆ పాకెట్టు ?" అన్నాడు గోపాలం, తను సంభాషణ కొనసాగించకపోతే బాగుండదని.

"చీర నా వైఫ్‌కోసం ... చూడండి," అంటూ, పాకెట్టు విప్పి వెంకటగిరి సరిగ చీర ఒకటి బయటికి తీశాడు వెంకటనరసయ్య.

"చాలా బాగుంది ... ఎంత?"

"నూటయాభై ... మరి ఆ మాత్రం ఖర్చు చెయ్యకపోతే, భార్యామణిని శాంతింపజెయ్యటం కష్టం గదటండీ ?" అన్నాడు వెంకటనరసయ్య. ఆ మాటల్లో, తెలుగుపండితుడి చాదస్తంతోబాటు నిష్కపటత కూడా కనిపించింది గోపాలానికి.

"కోపంతో వుంటే గద - శాంతింప జేసే అవసరం ?" అన్నాడతడు.

"అదేమిటండోయ్... మా యావిడ కోపంతో వెళ్ళిపోయిన సంగతి మీకు తెలీదా?," అంటూ ధణధణ మని ప్రారంభించాడు వెంకటనరసయ్య - "చూడండి - మా యావిడేమో నాలుగో కాన్పుకు కూడా పుట్టింటికి వెడతానంటుంది. నాకేమో అది నచ్చదు. నేనంటానూ - ఆ పుట్టింటివాళ్ళేమీ లక్షాధికారులు కాదు గదా, వాళ్ళమీద వెళ్ళి పడడం దేనికి? మన అవస్థలేవో మనమే పడి గౌరవం నిలుపుకోవటం మంచిదికదా, అని. దాంతో తుఫాను లేచింది. ఈ ఆడవాళ్ళకు, పుట్టింటి మమకారం ముందు, వివేకం ఎగిరిపోతుంటుందండీ! కాని నేను మాత్రం నా ఆత్మగౌరవానికి సంబంధించిన విషయాల్లో ఆడపెత్తనం సహించేవాణ్ని కాదు .... కావలిస్తే కాన్పుకు ముందుగా కొన్ని రోజులు పుట్టింట్లో వుండి వచ్చెయ్యమని ఆవిణ్ని, పిల్లల్ని పంపించాను."


ఉచితం ఉచితం ఉచితం

## తెల్లమచ్చలకు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడినయెడల మూడు దినములలో మారును. ఆటుపైన మామూలు చర్మంవలె మండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసామందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

**ADDRESS**

Samaj Kalyan (R. L.-18)

P. O. Katni Sarri (GAYA)

కాస్త భేషజం ధ్వనిస్తున్నా, ఆ మాటలు సబబుగానే తోచాయి గోపాలానికి.

"వెళ్ళేటప్పుడు కోపంగా వెళ్లింది కదా - ఆవిడ వచ్చాక శాంతింపచేద్దామని, ఈచీర కొన్నాను. పాపం, గర్భిణీ కదండీ మరి!" అన్నాడు, వెంకట నరసయ్య మళ్ళీ చాదస్తపు ధోరణిలో.

మరి కాసేపు సాగింది వాళ్ల సంభాషణ. దానివల్ల గోపాలానికి అర్థమయిందేమిటంటే, వెంకట నరసయ్యది సామాన్య సంసారం. ఆయన నెలసరి సామాన్లు తెచ్చి పడెయ్యటం తప్ప మిగతా గృహ నిర్వహణ అంతా భార్యకే వదిలి, తను తెలుగు వ్యాకరణాల్తో కాలం గడుపుతుంటాడు. ఆమెకు యింటి బాధ్యతల వల్ల, కాంపౌండులో చెట్టూ చేమా పెంచుకునే తీరికైనా దొరకదు.

అక్కణ్నుంచీ లేచివెళ్ళేటప్పుడు మిరపచెట్లను మెచ్చుకున్నాడు వెంకటనరసయ్య. బయట యింకా చీకటిగా వుండటంవల్ల, టార్చిలైటుతో ఆయన్ని వాళ్ళ కాంపౌండు దాకా దిగబెట్టాడు గోపాలం.

మరోనాలుగు రోజులకు జానకి జొన్నవాడ నుంచీ తిరిగొచ్చింది. తమయింటికి పక్కింటాయన వచ్చిన విషయం ఆమెకు చెప్పలేదు గోపాలం. మరోవారం తిరిగే సరికల్లా పక్కింటాయన భార్య తిరిగి రావటం, అసలేమాత్రం గొడవ జరగలేదన్నట్లుగా ఆ భార్యాభర్తలు మామూలుగా వుండటం, గమనించాడతడు. జానకి మాత్రం వాళ్ళను అసహ్యించుకోవటం మానలేదు; ఆ అరవ దంపతుల్ని ఆకాశాని కెత్తటమూ మానలేదు.

"బట్టలు వేసుకోవటంలో కూడా ఏమి పొందికో చూడండి. ఆ అరవ్వాళ్ళు! ఆ పొందిక అందరికీ రాదు. అసలు కొందరున్నారే, వెకిలిగా ఎర్రచీరొకటి ఒంటికి చుట్టుకుని, 'ఇది మా ఆయన ప్రేమ చిహ్నంగా తెచ్చాడండోయ్', అని దండోరా వేస్తున్నట్లుగా కనబడ తారు... అలాకాదు ఆ దంపతులు. ఎంత హుందా, ఎంత నాణ్యత—" అంది ఆమె. ఒక సాయంత్రం వీధిలో వెళ్తున్న ఆ అరవ దంపతుల్ని చూపుతూ. ఆ విమర్శ ఎవరిపై గురిచెయ్యబడ్డదో అర్థం కాకపోలేదు గోపాలానికి. ఆరోజు వెంకట నరసయ్య తనకు చూపించిన వెంకటగిరి చీర ఎరుపు రంగుదే.

మరో సాయంత్రం అతడు ఆఫీసు నుంచి వచ్చి వరండాలో అడుగుపెట్టి అక్కడే ఆగిపోయాడు.

లోపల గదిలో తులశమ్మ గొంతు వినబడుతోంది.

"బయటికి అలా కనిపిస్తారుగాని ఆ అరవ్వాళ్ళు యింట్లో తర చుగా పోట్లాడుకుంటూ వుంటారట", అంటోది తులశమ్మ.

"పోనివ్వండి పాపం", అంటోంది జానకి, "కాస్సేపు గిల్లికజ్జా వేసుకుంటూ వుంటేనే కదా, కొత్త సంసారల్లో సరదా"...

"అదీ నిజమే... రేపో మాపో బిడ్డచంకలోకి వచ్చిదంటే, అప్పుడీ సరదాలకు టైమెక్కడుంటుంది మరి ?"

"అంటే...?"

"ఆ అమ్మాయి నెలతప్పిందట ... సరేగాని, అమ్మాయ్ మనం జొన్నవాడకు వెళ్ళొచ్చిన తర్వాత నువ్వు బయటున్నావా?"

"ఉన్నానండీ ... నాలుగు రోజులైంది," జానకి కంఠ నీరసంగా వుంది.

"నాకు తెలీదమ్మాయ్ .. నువ్వు బయట కూచోలేదు కాబట్టి, అలాంటిదేమీ లేదనుకున్నాను." అని అంతలోనే మాటమార్చింది తులశమ్మ, "అన్నట్టు మర్చిపోయాను. చక్కెర వుంటే ఓ గిన్నెడివ్వు ఈ నెల్లో యింకా కొనలేదు ..."

అంతవరకు విన్న గోపాలం, బూట్లచప్పుడు చేసుకుంటూ లోప లికి అడుగు పెట్టాడు. తులశమ్మ చక్కెర గిన్నెతో బయటికి వెడు తోంది. నలుగురికీ నాలుగు మృదువైన మాటలు చెప్పి చిన్న చిన్న వస్తువులు సంపాయించటం తప్ప ఆవిడకు వేరే దురుద్దేశాలేవీ వుండవని అనిపించింది అతడికి.

అతడు బట్టలు మార్చుకుని, ఏదో మేగజైన్ అందుకుని కాంపౌండులో కుర్చీవేసుకుని కూచున్నాడు. చల్లగా గాలి వీస్తోంది. ఆ గాలికి మిరప్పండ్లు అహంకారంగా కదులుతోంటే, పక్కనే ఎదిగి ఎదగని చేమంతులు వెలవెలా పోతున్నాయి.

"ఎంతసేపైంది మీరువచ్చి ?" అంది జానకి పక్కగావచ్చి నిల్చుంటూ.

"ఇప్పుడే..."

ఆమె లోపలికి వెళ్లి కాఫీ తెచ్చింది. అందుకుని తాగుతూ అతడు బయటికి చూసేసరికి, ఆ అరవదంపతులు ఒకర్నొకరు రాచ కుంటూ వీధిలో నడిచివెళ్లుతున్నారు.

"చూడు -" అన్నాడతడు.

"పోనిద్దురూ, అరవగుంపు," అంది జానకి. అతడాశ్చర్యంగ చూశాడు. ఆ ఆశ్చర్యంలోంచీ తేరుకోకముందే, ఆమె మళ్లీ అంది

"ఏంవిటో, యీ కొంప- నాలుగు చేమంతులుకూడా పెరగట్ట లేదిక్కడ... మరో మంచి యిల్లు చూద్దురూ - మీకు పుణ ముంటుంది."